మామిడి రైతు కుదేలు

- అకాల వర్షాలకు నేలరాలిన కాయలు
- నామమాత్రపు ధరలకే కొనుగోలు చేస్తున్న దళారులు
- ఆందోళనలో రైతులు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ఏటా నష్టపోతున్న తమకు ఈ ఏడాదైనా లాభాలు వస్తాయనుకున్న మామిడి రైతుల ఆశలు అడియాశలుగానే మిగిలాయి. ఈదురు గాలులుకు పిందెలు, కాయలు రాలిపోతుండగా వర్షాలకు మంగు తెగులు సోకడంతో ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఆకాశాన్ని అంటాల్సిన ధరలు పాతాళానికి పడిపోయాయి.


పెనుబల్లిలోని మార్కెట్‌లో పోసి ఉన్న మామిడి కాయలు

పెనుబల్లి: మామిడి రైతులు పండిన పంటకు సరైన ధర లేక నష్టాలతో సతమతమవుతున్నారు. ఈ ఏడాది మామిడి కాపు భాగానే ఉన్నప్పటికీ ఏప్రిల్, మే నెలలో కురిసిన అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి పూత, పిందెలు, కాయలు రాలిపోవడంతో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుంచి వచ్చిన సేట్లు స్థానిక మార్కెట్లలో టన్ను మామిడి కాయలకు కనిష్ఠంగా రూ.10 వేలు, గరిష్ఠంగా రూ.22 వేలు ధర మాత్రమే రైతుకు ఇస్తున్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రావని ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న కొందరు వ్యాపారులు డిసెంబర్, జనవరి నెలల్లోనే మామిడి ఆకు, పూత దశలో ఉన్నప్పుడే గతంలో మాదిరిగా టన్నుకు రూ.30 వేల నుంచి 40 వేల వరకు ధర వస్తుందన్న అంచనాలతో భారీ మొత్తం చెల్లించి రైతుల వద్ద నుంచి తోటలు కొనుగోలు చేశారు. దీంతో కొలు మామిడి రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది.

అకాల వర్షాలతో మరింత నష్టం..

గాలిదుమ్ముతో కూడిన ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా మామిడి కాయ నాణ్యత లోపించి మంగు ఏర్పడింది. దీంతో మామిడి కాయలపై మచ్చలు ఉండటంతో పాటు పండకుండా పురుగు పడి కుళ్లిపోతున్నాయని రైతులు, తోటలు కొనుగోలు చేసిన వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రపు ధరలకే విక్రయాలు..

మామిడి కాయ నాణ్యత లోపించిన కారణంగా దూరప్రాంతాలకు మామిడి కాయలను తీసుకుపోయి అమ్ముకునే సమయానికి కుళ్లిపోయి పాడైపోతుందని, మేము అధిక ధర చెల్లిస్తే నష్టపోవాల్సి వస్తుందని ఢిల్లీ సేట్‌లు నామమాత్రపు ధరకు మార్కెట్‌కు వచ్చిన కాయలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన కాయ నుంచి కూడా గ్రేడింగ్ చేసి మచ్చలు ఉన్నా, డ్యామేజీ అయినా కాయలను సగం వరకు ఏరిపారేస్తున్నారని, దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి రాక రైతుల ఆవేదన..

ఆకు, పూత దశలో అమ్ముకున్న రైతులకు కొన్ని స్థానిక వ్యాపారులు కాయ సరిగ్గా లేదనే కారణం చేత సొమ్ము చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందంటున్నారు. మూడు, నాలుగు సార్లు పురుగు మందులు పిచికారీ చేసి, ఎరువులు వేసి, కాపలా కాపించడానికి అయిన సొమ్ములు కూడా రైతుకు దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖాధికారులు స్థానిక రైతులకు అకాల వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, నష్ట నివారణ చర్యలు చేపడితే తప్ప మామిడి రైతుకు లాభాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

ఐదెకరాలను రూ.40 వేలకే అమ్మినా..



నాకు ఉన్న 5 ఎకరాల మామిడి తోటను రూ.40 వేలకే అమ్మాల్సి వచ్చింది. వాతావరణం భాగా లేకపోవడంతో కేవలం ఎకరాకు రూ.8 వేలు వచ్చేలా ఐదు ఎకరాలను 40 వేలకు అమ్మాను. ఈ సొమ్ము దుక్కి దున్నాడానికి, ఎరువులు వేయడానికి, పురుగు మందు పిచికారీ చేయడానికి సరిపోవు. మామిడి కాయ అంటే పూర్తిగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడటంతో లాభాలు రాక మామిడి తోటలు నరకాల్సి వస్తుంది.

– మల్లెల నరసింహారావు, పెనుబల్లి

టన్ను రూ.20 వేలు మాత్రమే..



గత ఏడాది టన్ను రూ.30 వేల నుంచి రూ.40 వేల మధ్యలో మామిడి ధర పలికింది. ఈ ఏడాది కూడా అదే అంచనాలతో తోటలు కొనుగోలు చేశాం. అకాల వర్షాలతో కాయకు మంగు రావడంతో టన్ను సుమారు రూ.20 వేలు మాత్రమే పలుకుతుంది. దీంతో గత ఏడాది ధరల ప్రకారం కొనుగోలు చేసిన వ్యాపారులు బారీ ఎత్తున నష్టపోవాల్సి వస్తుంది.

– జంపా వియన్నబాబు, మామిడి కాయ మార్కెట్ నిర్వాహకుడు

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం


తల్లాడ: కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు చీర అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


చింతకాని: రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

తల్లాడ/చింతకాని: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముభారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారు శుక్రవారం పంపిణీ చేశారు. తల్లాడ మండలంలోని రైతు వేదికలో తహసీల్దార్ గంటా శ్రీలత అధ్యక్షతన 48 మంది లబ్ధిదారులకు రూ.4,85,568ల విలువ కలిగిన కల్యాణ లక్ష్మి, షాదీముభారక్ చెక్కులను ఎమ్మెల్యే సండ్ర పంపిణీ చేశారు. వీటితో పాటుగా మహిళలకు చీరలను కూడా అందించారు. చింతకానిలోని రైతు వేదికలో 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులు, 22 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. రహదారులు, విద్య, వైద్యం, పలు సంక్షేమ పతకాలకు వెయ్యి కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ఈ నెల 2 నుంచి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు.

ఎమ్మెల్యేకు వీఆర్ఏల సన్మానం..

వీఆర్ఏలకు పే స్కేల్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఎమ్మెల్యే వెంకటవీరయ్యను తల్లాడ మండల వీఆర్ఏలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మల్లవరం గ్రామంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తల్లాడ సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ వెంకట్‌లాల్, వైరా ఏఎంసీ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, శ్రీనివాసరెడ్డి, దాసురావు, శ్రీనివాసరావు, మువ్వా మురళి, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు రమేష్, తహసీల్దార్ మంగీలాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురి లబ్ధిదారులకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ శుక్రవారం పంపిణీ చేశారు. వీటితో పాటు కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను అందించారు. అనంతరం వీఆర్ఏల పేస్కేల్ పెంచడంతో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వనంవారికిష్టాపురంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇనాం భూములు కాపాడాలి


దీక్షా శిబిరంలో పాల్గొన్న ఇనాం భూముల పట్టాదారుల వారసులు

వైరా: వైరా మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని ఇనాం భూములపై సమగ్ర విచారణ జరిపి బల్వతి ఇనాం భూముల పట్టాదారుల వారసులు 9మందికి ఇవ్వాలని రిలే దీక్షలు చేపట్టారు. ఎస్సీ కాలనీ 83, 91 సర్వే నంబర్లలోని బల్వతి ఇనాం భూములకు సంబంధించి 7 ఎకరాల 16 కుంటల భూమిపై సమగ్ర విచారణ జరిపి అక్రమ కట్టడాలు కూల్చివేసి వారికి అప్పగించాలన్నారు. అధికారులు తక్షణమే సర్వే చేయించి ఇనాం భూములు కాపాడాలన్నారు. భూములు సర్వే చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. దీక్షలో తిరుమలరావు, రాంబాబు, నవీన్, దాసు, విజయ్, సురేష్, విజయ్‌కుమార్, నాగరాజు, రమేష్, మరియమ్మ, బంగారమ్మ, సుగుణమ్మ, వెంకటమ్మ, పుష్పమ్మ, సీతమ్మ, దేవకర్ణ తదితరులు పాల్గొన్నారు. వీరి దీక్షలకు పలు పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు.

‘ప్రజాగర్జన సభ’ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

సత్తుపల్లిరూరల్: జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీని గద్దె దించటమే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, సింగు నర్సింహారావు, శివరామకృష్ణ, యోబు, రామకృష్ణ, దయాకర్‌రావు, రామలక్ష్మి, నారాయణరావు, జగన్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



సత్యనారాయణపురంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు


ఎర్రుపాలెం: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో రైతుల కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. సకాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటూ అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాళ చంద్రమౌళేశ్వరరావు, దేవరకొండ కోటేశ్వరరావు, మిర్యాల నాగేశ్వరరావు, మిర్యాల వెంకటేశ్వరరావు, పిట్టల గోపాలరావు, మల్లెల మోహన్‌రావు, వేమా ఏడుకొండలు, రామకృష్ణ, శివమణి రెడ్డి తరుతరులు ఉన్నారు.

ఆదర్శ నేత.. పుచ్చలపల్లి సుందరయ్య

పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలను శుక్రవారం సీపీఎం, వ్యవసాయ కార్మిక సఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రజా సేవకై తన జీవితాన్ని అంకితం చేసిన కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అన్నారు. కుల మత, మితవాద రాజకీయ దారులను ఓడించి శ్రామిక ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడమే సుందరయ్యకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. నేటితరం సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరాలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


సత్తుపల్లిరూరల్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కొణిజర్ల: తనికెళ్లలో నివాళులు అర్పిస్తున్న మహిళా కార్యకర్తలు


బోనకల్‌లో..



ఎర్రుపాలెంలో..


తల్లాడలో..

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ లత

మధిర: రాష్ట్ర పురపాలక శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధిర మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పూడికలు తీసి డ్రెయిన్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందన్నారు. ప్రతీ వార్డుని పరిశుభ్రంగా ఉంచేందుకే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పట్టణ ప్రజలు కూడా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బండి వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కోనా ధని కుమార్, వీరమాచినేని నాగ సులోచన, యర్రగుంట లక్ష్మి, మున్సిపల్ మేనేజర్ రవీందర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలి


చిన్నారులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న దృశ్యం

ఏన్కూరు: క్రమం తప్పకుండా చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీకాలు వేయించడం వలన భవిష్యత్‌లో చిన్నారులు అన్నివ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. వారం వారం టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.రాములు పాల్గొన్నారు.

పట్టించుకోని పాలకవర్గం


పారిశుద్ధ్య సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ పాలకవర్గం కానీ, మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని బీజేపీ మధిర నియోజకవర్గం కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం 9, 14 వార్డుల్లో బీజేపీ బృందం పర్యటించి పారిశుద్ధ్య సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14వ వార్డులో చెత్త సమస్య ఉందని, 9వ వార్డులో పందులు చనిపోయినప్పటికీ కళేబరాలను తొలగించడం లేదన్నారు. పారిశుద్ధ్య సమస్యపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికీ స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, కాసిన నాగభూషణం, కోనా నరసింహారావు, బియ్యవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రుపాలెం: ఈ నెల 23న మధిర ప్రభుత్వ హాస్పటల్‌లో దివ్యాంగుల సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హులైన దివ్యాంగులు ఆధార్ కార్డు, ఫొటోలతో మీ సేవ కార్యాలయాలకు వెళ్లి సదరం స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. సదరం క్యాంపుకు మీసేవ బుకింగ్ రశీదు, ఆధార్‌కార్డు, ఫొటో, రేషన్‌కార్డులతో హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఫౌండేషన్‌కు అప్పగింత


మారేశ్వరరావును తీసుకెళ్తున్న అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు


కల్లూరు: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన దుగ్గిరాల కృష్ణ కుమారుడు మారేశ్వరరావు మతి స్థిమితం కోల్పోయి గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడు. శుక్రవారం కూడా గ్రామంలో హల్‌చల్ చేయగా స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో స్పందించిన ఎస్సై పి.రఘు అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో వారు అతనిని ఖమ్మం తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై చారి, తల్లపురెడ్డి నర్సిరెడ్డి, మేకల కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు


కిష్ట వినయ్

మధిర: నాణ్యమైన విద్యాబోధనతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చిలుకూరు గ్రామ సర్పంచ్ నిడమానూరు సంధ్య తెలిపారు. చిలుకూరు ఉన్నత పాఠశాలకు చెందిన కిష్ట వినయ్ జాతీయస్థాయి ఉపకార వేతనమైన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వినయ్‌ని గ్రామ సర్పంచ్ అభినందించారు. ఈ విద్యార్థికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వూట్ల శంకర్ రావు, ఉపాధ్యాయుల శ్రమతోనే గత ఎని మిది సంవత్సరాలుగా ఈ పాఠశాల నుంచి 30 మందికి పైగా విద్యార్థులు ఈ స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వినయ్‌ని అభినందించిన వారిలో విద్యా కమిటీ చైర్మన్ సునీల్ కుమార్, ఎంఈఓ వై.ప్రభాకర్, సీహెచ్ రాంబాబు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


వైరాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

వైరా/ ఎర్రుపాలెం/ ఏన్కూరు/ చింతకాని: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లను రెగ్యులర్ చేస్తామని గురువారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన నేపథ్యంలో శుక్రవారం వైరా, ఎర్రుపాలెం, ఏన్కూరు, చింతకాని మండల కేంద్రాల్లోని వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరకాలంగా తాము చేస్తున్న నిరీక్షణ నేటికి ఫలించిందన్నారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తామని, పేస్కేలు వర్తింప చేస్తున్నట్లు కేబినెట్ మీటింగ్‌లో ఆమోదింప చేసి సీఎం కేసీఆర్ ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాలల్లో వీఆర్ఏల సంఘం నాయకులు ఎస్‌కే జానీ, కె.బాలమురళీ కృష్ణ, రహీమ్, రామాంజం, సుధాకర్, మదార్, అశోక్, జమాల్, నూర్జాహాన్, సైదమ్మ, విజేత, అనీఫా, మమత, కొండలు, వీఆర్ఏల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు షేక్ బాజీబాబా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, బాజీ, శ్రీలత, వాసు, ఎస్‌కె బాషా, జాని, రామారావు, లాలయ్య, రామకృష్ణ, మదార్‌బీ, జారా కృష్ణ, చింతకానిలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి, కోశాధికారి స్వరూప, సభ్యులు రమేష్, మీరావలి, రవి, కరీముల్లా, నాగేశ్వరరావు, షరీఫ్, రాములమ్మ, కవిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక శిక్షణ అభినందనీయం

సత్తుపల్లిటౌన్: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా విద్యాశాఖాధికారుల సూచనల మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రత్యేక టైం టేబుల్ ప్రకారం శిక్షణ ఇస్తున్నారని పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ లాల్ అహ్మద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్త్ పైపులకు వాటర్ సప్లై

మధిర: మధిర పట్టణంలో అత్యధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కుతున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్ వద్ద శుక్రవారం ఎర్త్ పైపులకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎర్త్ వైర్లను చల్లబరిచే విధంగా విద్యుత్ శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకుంటున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో విద్యుత్ వినియోగం పెరగడంతో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్‌పై అధిక లోడు ఏర్పడి తరచూ ఫీజులు పోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది మధిర పట్టణంలోని రెండు సబ్ స్టేషన్‌లతో పాటు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్ వద్ద నీటితో చల్లబరిచే కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థినికి సత్కారం

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 9.7 శాతం జీపీఏతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన చిన్న గోపతికి చెందిన విద్యార్థిని బండారు అశ్వినిని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. మున్ముందు చదువులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త యాలాద్రి, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వార్డు సభ్యురాలు నాగమణి, రాజేష్, భార్గవి, శ్రీనివాసరావు, నగేష్, శంకరరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం

మధిర: మండలంలోని మానసిక దివ్యాంగులకు భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం దివ్యాంగులకు అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిల్లేపల్లి బాబురావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ సహకారంతో జిల్లా అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత, పార్టీ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆటో.. ఒకరికి గాయాలు

మధిర: మధిర పట్టణంలోని శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం మోటార్ సైకిల్‌ను తప్పించబోయిన ఆటో పక్కనే ఉన్న ఆస్పత్రి బోర్డులోకి దూసుకుపోయింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను సత్తుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గురువారం అర్ధరాత్రి సమయంలో కల్పతరు కాంప్లెక్స్‌లోని ఓ దుకాణం తాళాలు పగలకొడుతుండగా షాపు యజమాని ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తూ గమనించి చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ దొంగలను పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

మొబైల్ ఫోన్లు రికవరీ

తల్లాడ: రూ.70 వేల విలువైన మూడు మొబైల్ ఫోన్లను తల్లాడ పోలీసులు రికవరీ చేసి శుక్రవారం భాదితులకు అందజేశారు. తల్లాడ మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల ఫోన్లు ప్రయాణం చేస్తుండగా పోయాయి. దీంతో వారు తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సురేష్ వాటిని పట్టుకున్నారు. అట్టి ఫోన్లను వైరా ఏసీపీ రెహమాన్ చేతుల మీదుగా అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కుర్నవల్లి విద్యుత్ ఏఈ సుందర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టపల్లి, నారయ్య బంజర, నూతనకల్, మల్సూర్‌తండా, రామానుజవరం, లక్ష్మీపురం, వెంకటాపురం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేయనున్నట్లు తెలిపారు.